అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




మామునూరుకు మహర్దశ!

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -67 మంగళవారం 11 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?**

**ఆగస్ట్ 17 నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు**

**ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా ఉండనున్న వైసీపీ**

**శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం**

**మండలిలో మెగా డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వ్యూహం**

**హైకోర్టులో విచారణలో ప్రతిపక్ష హోదా అంశం**

**అమరావతి ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదంమిగతా 2లో...

## సమృద్ధిగా వర్షాలు కురవాలని..

# మహావరుణయాగం


## సీఎం రేవంత్‌రెడ్డి సతీసమేతంగా సాగర్‌లో పూజలు

**-అన్ని ప్రాజెక్టులు, చెరువులూ జలకళతో ఉండాలని ప్రార్థనలు**

**108 మంది వేద పండితులతో.. 11 హోమగుండాలు -మంత్రి ఉత్తమ్ పర్యవేక్షణ.. మంత్రుల హాజరు**

**నాగార్జునసాగర్ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణాగోదావరి పరీవాహక ప్రాంతాలు జలకళను సంతరించుకోవాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. కృష్ణా నది తీరంలోని విజయ్ విహార్ పర్యాటక అతిథి గృహ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో తెల్లవారుజామున నాలుగు గంటలకు యాగం ప్రారంభమైంది. ఆ తర్వాత మధ్యాహ్నం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సతీసమేతంగా పూర్ణాహుతి సమర్పించడంతో యాగం ముగిసింది. ఈ యాగంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. .మిగతా 2లో...





## పార్లమెంట్ లో ప్రతిపక్షాల

# ఆందోళన

**అమిత్ షా సభకు రావాలి**

**విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలి**

**రాజ్యసభలో సభ్యుల వాకౌట్**

**ఉభయసభల్లో చెరో బిల్లు ఆమోదం**

**లోక్‌సభలో నాలుగు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం**




**-న్యూఢిల్లీ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని, విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాల దాడి, అయోధ్య రామమందిరం విరాళాల చోరీకి వ్యతిరేకంగా సోమవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. రాజ్యసభలో విపక్షాలు వాకౌట్ చేశాయి. లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ ప్రేమచంద్రన్ ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించగా ప్రతిపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు హోరెత్తించారు. జులై 20న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీ గురించి వివరణ ఇవ్వాలని, కేంద్ర మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సభ సమావేశమైన కొన్ని సెకన్లలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు.మిగతా 2లో...


2లో.

## తమిళ గీతానికే తొలి ప్రాధాన్యం

**: కేంద్రం ఆదేశాలపై విజయ్ ప్రభుత్వం సంచలన తీర్మానం**

**ఇకపై మొదట రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాళ్తు'నే ఆలపించాలి**

**అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన ప్రభుత్వం**

**తొలి స్థానం ఇవ్వడం తమ హక్కు అని స్పష్టం చేసిన సీఎం విజయ్**

## తెలంగాణలో ముగిసిన సర్

**రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు**

**హైదరాబాద్, ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది.మిగతా 2లో...



## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

**రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి**

**మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ**

**హైదరాబాద్,ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** :తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న .మిగతా 2లో...





# జనం గుండెల్లో చిరస్థాయిగా పెద్ది

**ఆ కుటుంబానికి అండగా బీఆర్ఎస్**

**నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెట్టడం ఖాయం**

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్**

**విగ్రహం గద్దె కూల్చివేతపై శ్రేణుల తీవ్ర ఆగ్రహం**

**కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్**

**నర్సంపేట/నల్లబెల్లి ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట అభివృద్ధి ప్రధాత, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. పెద్ది సంస్మరణ సభను ఆయన స్వగ్రామమైన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు.మిగతా 2లో...

## పొగాకు రైతులకు ప్రభుత్వం అండ

**వడ్డీలేని రుణంగా 50 వేల చొప్పన అందిస్తాం**

**పొగాకు సాగు 80 మిలియన్ కిలోలకు కట్టడి చేయాలని నిర్ణయం**

**టొబాకో బోర్డు కార్యాలయంలో సమీక్షలో మంత్రి అచ్చన్నాయుడు**



**గుంటూరు, ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** పొగాకు రైతులకు ఒక్కొక్కరికి రూ.50 వేలను వడ్డీ లేకుండా రుణం రూపంలో అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. రెండేళ్ల పాటు వడ్డీ లేకుండా రూ.50వేలు ఇస్తామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తరఫున క్వింటాలుకు రూ.1000లను అందజేస్తామని తెలిపారు. పొగాకు కొన్న 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే ఏడాది పొగాకు సాగు 80 మిలియన్ 2లో...

## భూభారతితో రైతులకు

# ప్రజాప్రభుత్వం భరోసా

**ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు**

**ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ**

**గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి**

**హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం**


**హనుమకొండ, ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు.

జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు.మిగతా 2లో...



# భూభారతితో రైతులకు ప్రజాప్రభుత్వం భరోసా





**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని..

# సీఎం రేవంత్‌రెడ్డి మహావరుణయాగం





**మొదటిపేజీ తరువాయి**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అర్చకులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం యాగాన్ని నిర్వహించారు. యాదగిరిగుట్టతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు చెందిన 108 మంది వేద పండితులు, రుత్వికులు, అర్చకులు యాగ క్రతువులో పాల్గొన్నారు. ఇందుకోసం 11 ప్రత్యేక హోమగుండాలను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు మంత్రోచ్చారణలు, సంకల్పంతో ప్రారంభమైన యాగంలో వరుణ జపాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.45 గంటలకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు యాగశాల వద్దకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. యాగ ప్రాంగణానికి చేరుకున్న సీఎం దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారం సాయంత్రం 3.20 నుంచి 3.24 గంటల మధ్య వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాక్రతువు ఏర్పాట్లను నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

# తమిళ గీతానికే తొలి ప్రాధాన్యం

**: కేంద్రం ఆదేశాలపై విజయ్ ప్రభుత్వం సంచలన తీర్మానం**

**ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):**

తమిళనాడులోని అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఇకపై రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాళ్తు'కే ప్రథమ ప్రాధాన్యం లభించనుంది. కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం తమిళనాడు శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రాష్ట్రంలోని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ నిబంధన వర్తిస్తుంది.ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ వాయిస్ ఓటు ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమిళ భాష తమ రాష్ట్రానికి ప్రాణనాడి, భావోద్వేగం, అస్తిత్వమని అభివర్ణించారు. "తమిళం మన గర్వం, తమిళం మన శక్తి. 'తమిళం' అన్న పదం యావత్ తమిళనాడును ఏకతాటిపైకి తెస్తుంది. తమిళ తాయ్ వాళ్తుకు రాష్ట్రంలో ప్రథమ స్థానం ఉండాలి, దానికి అగ్రపీఠం వేయడం మా హక్కు" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర భాషా, సాంస్కృతిక హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, తమిళ భాషాభిమానం దేశభక్తి పరస్పర విరుద్ధం కావని ఆయన పేర్కొన్నారు.అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతానికి ముందు జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల ఒక సూచన చేసింది. రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గీతం లేదా గేయం ఆలపించాల్సి వస్తే, జాతీయ గేయానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సాంస్కృతిక మూలాలను పరిరక్షించేందుకు ఈ తీర్మానం చేశామని, ఇది రాజ్యాంగం కల్పించిన భాషా, సాంస్కృతిక హక్కులకు అనుగుణంగానే ఉందని ప్రభుత్వం వివరించింది. ఈ నూతన తీర్మానంతో, కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతం, ముగింపులో జాతీయ గీతం ఆలపించే సంప్రదాయం ఇకపై చట్టబద్ధంగా అమలుకానుంది.

# పొగాకు రైతులకు ప్రభుత్వం అండ

**మొదటిపేజీ తరువాయి**

కిలోలకు కట్టడి చేయాలని నిర్ణయించామని అన్నారు. దీన్ని కూడా రాజకీయం చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా పని చేసిన గొడ్డలి పార్టీ అధినేత లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహించారు.గుంటూరు జిల్లాలోని టోబాకో బోర్డు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొగాకు రైతుల సమస్యలు, ధరలు, కొనుగోళ్ల తీరుపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయులు, ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, టోబాకో బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి హయాంలో పొగాకు ధరలు తగ్గినా, చేసిందేమీ లేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. జగన్ హయాంలో కేవలం 11 మిలియన్ కిలోలు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నారని ప్రస్తావించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే పొగాకు రైతులకు మేలు జరిగిందని తెలిపారు. రైతులు ఈ విషయం గుర్తించాలని.. వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. పొగాకు నాణ్యత నిర్ధారణ కోసం ఐదుగురు సభ్యుల కమిటీ వేశామని వెల్లడించారు. గ్రేడ్ తక్కువని చెప్పి వ్యాపారులు ఇష్టారాజ్యంగా చేసేందుకు వీల్లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

**మొదటిపేజీ తరువాయి**

సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు.మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ÷ూఖాఖ ÷ుంఉఇ-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

-------------

# తెలంగాణలో ముగిసిన సర్

**మొదటిపేజీ తరువాయి**

దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్ఖ్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

-------------

# ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఎల్ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది.అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది. మండలిలో తమకు పూర్తి మెజారిటీ ఉండటంతో, వివిధ ప్రజా సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా, మెగా డీఎస్సీ-2025లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై మండలిలో గళం విప్పనుంది.ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, పారదర్శక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే, తాము డీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని గానీ, ఇప్పటికే నియామకమైన అభ్యర్థులను తొలగించాలని గానీ కోరడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. దీంతో ఈ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది.

# పార్లమెంట్ లో ప్రతిపక్షాల ఆందోళన

**మొదటిపేజీ తరువాయి**

తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే నాలుగు బిల్లులను ప్రవేశపెట్టారు.న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్మెంట్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కేరళం పేరు మార్పు బిల్లును హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సవరణ బిల్లును మంత్రి మురళీధర్ మోహల్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఎటువంటి చర్చ లేకుండానే ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాలు సభ సజావుగా సాగేందుకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. దీనికి ప్రతిపక్ష ఎంపీ కె.సి వేణుగోపాల్ స్పందిస్తూ చర్చకంటే ముందు విద్యార్థులపై క్రూరమైన దాడి గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభను నేటి(మంగళవారం)కి వాయిదా వేశారు. సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి లోక్‌సభ కార్యక్రమాలు ప్రతి రోజూ వాయిదాపడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది బిల్లులు ప్రవేశపెట్టగా ఆరు బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ "దాదాపు 20 రోజులు గడిచినా సమాధానం చెప్పేందుకు అమిత్ షా పార్లమెంటుకు రాలేదు. చర్చ కోసం ప్రతిపక్షం ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానాన్ని తిరస్కరించారు. ఆయన మౌనం పొరపాటు కాదు.. అది హింసకు ఆమోదం తెలపడమే. ఆయన దోషి అయినా అయి ఉండాలి లేదా అసమర్థుడైనా అయి ఉండాలి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఆయనను జవాబుదారీగా నిలబెట్టే వరకు మా పోరాటం ఆగదు" అని అన్నారు.

**రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్**

మరోవైపు రాజ్యసభలో కూడా అదే పరిస్థితి నెలకొంది. సభను ప్రారంభించిన వెంటనే ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. రామ మందిర విరాళాల చోరీపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. రామ మందిర విరాళాల చోరీ, నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వాడకం వంటి అంశాలను లేవనెత్తేందుకు ప్రయత్నించగా చైర్మెన్ అనుమతించకపోవడంతో ప్రతిపక్ష పార్టీల సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అదే సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ది బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు-2026'ను సభలో చర్చకు ప్రవేశపెట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు హోరెత్తించారు. ప్రతిపక్షాల ఆందోళనతో డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ వెంటనే సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2.15 గంటలకు సభ తిరిగి సమావేశం కాగా వలసవాద కాలం నాటి చట్టం స్థానంలో కొత్త చట్టం తీసుకువచ్చే బిల్లును నిర్మలా సీతారామన్ చర్చకు పెట్టారు. అయితే ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కొన్ని అంశాలను లేవనెత్తాలని ప్రయత్నించగా, ఎంపీలు కేవలం బిల్లుపై మాత్రమే మాట్లాడాలని సభాపతి స్పష్టం చేశారు. చర్చ అనంతరం బిల్లును ఆమోదించి, సభను నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.

# జనం గుండెల్లో చిరస్థాయిగా పెద్ది

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరై పెద్ది చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహనీయుడని కొనియాడారు. 'ఎంతకాలం బతికాం అన్నది కాదు, ఎలా బతికాం అన్నదే ముఖ్యం. లక్షలాది మంది నీరాజనాలు పలకడమే పెద్ది ప్రజాదరణకు నిదర్శనం' అని చెప్పారు. కరోనా విపత్కర సమయంలోనూ నర్సంపేటలో ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. నర్సంపేటలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేసిన పెద్ది కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందని భరోసానిచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఘనంగా తీజ్ పండుగ



**దామరచర్ల/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త);** దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలో గిరిజన ఆడబిడ్డల ఆరాధ్య పండుగ తీజ్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కాబోయే భర్త మంచి గుణవంతుడై ఉండాలని, పాడిపంటలు, పశుసంపద సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ నవధాన్యాలను బుట్టలో విత్తనాలుగా నాటి పెంచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తొమ్మిది రోజులపాటు ఆడబిడ్డలు ఉపవాసం ఉంటూ మొలకలకు నీరు పోస్తారని తెలిపారు. మొలకలు ఎంత పచ్చగా పెరిగితే తమ జీవితం అంత సుభిక్షంగా ఉంటుందని గిరిజనుల విశ్వాసమన్నారు.ప్రకృతితో ముడిపడిన తీజ్ వంటి పండుగలు గిరిజనుల ప్రత్యేకతను చాటుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణి నాగునాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ర్యాలీ.. రాస్తారోకో



**తల్లాడ/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త)**కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్కేయం ఇచ్చిన పిలుపు మేరకు తల్లాడలో సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బస్టాండ్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. దీంతో అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది.పోలీసులు ఆందోళనకారులను విరమించాలని కోరినా నిరసన కొనసాగించడంతో ఎస్సై వెంకటకృష్ణ పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సేలం పకీరమ్మ, సేలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, సీఐటీయూ నాయకులు సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, చిర్రా లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పులి కృష్ణయ్య, ఆశా వర్కర్స్ నాయకులు తాళ్ల రాణి, గుడిపల్లి కృష్ణ, దాడిపల్లి నరేష్, దూళ్ల ప్రభాకర్, కళ్యాణం కృష్ణయ్య, మన్నేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# బుడోకాన్ కరాటే జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**హసన్‌పర్తి/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త);**బుడోకాన్ కరాటే ఇంటర్నేషనల్ వరల్డ్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సహ కార్యదర్శి, మాస్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో బుడోకాన్ కరాటే మాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ టెక్నికల్ డైరెక్టర్‌గా పాండా దినేష్‌బాబు, అధ్యక్షుడిగా దామెర శంకర్, ఉపాధ్యక్షుడిగా గుండె శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా ఎండీ సలీం పాషా, సహ కార్యదర్శిగా రేణుకుంట్ల దుర్గాప్రసాద్, కోశాధికారిగా పాశం దేవయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా రియాన్ పాషా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దామెర శంకర్ మాట్లాడుతూ



తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కరాటే క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.కరాటే




ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను కరాటే శిక్షణ వైపు ప్రోత్సహించాలని సమావేశంలో పలువురు సూచించారు. నూతన కమిటీ సభ్యులకు కరాటే మాస్టర్లు అభినందనలు తెలిపారు.

# జానపద సొగసుతో సిలుకు సిలుకు సీరాలు!

## క్యాతంపల్లిలో పాట చిత్రీకరణ ప్రారంభం

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త);** జానపద సొబగులు, పల్లె జీవనశైలిని ప్రతిబింబించేలా రూపొందుతున్న సిలుకు సిలుకు సీరాలు నాకే తెస్తానంటాడు నా మొగుడే పాట చిత్రీకరణకు క్యాతంపల్లిలో సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రముఖ గాయకుడు అనితా ఓ అనితా పాట ఫేమ్ నాగరాజు చేతుల మీదుగా చిత్రీకరణ ప్రారంభమైంది.గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న పాటకు జేఎన్ దర్శకత్వం వహిస్తుండగా.. జానీ ఏజే కొరియోగ్రఫీ, నాని మైలారం సాహిత్యం, బాను టెంపో సంగీతం, రాకీ భాయ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. మమతా రమేష్ గానం చేస్తున్నారు. స్వప్న కథానాయికగా, ప్రకాష్ మహారాజ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. అరవింద్ నిర్మాతగా,



నవీన్ బృంద నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నారు. క్యాతంపల్లి గ్రామంలోని సహజ వాతావరణంలో పాటకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్‌ను చూసేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాట చిత్రీకరణకు సహకరించిన గ్రామ సర్పంచ్, పెద్దలు, స్థానికులకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపింది.పాట పూర్తి వీడియోను త్వరలో జేఎన్ ట్యూన్స్ 406 వేదికగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.



# బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ధ్వంసం

**హనుమకొండ/బ్యూరో ఆగస్టు10(జర్నలిస్ట్ వార్త);**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. అక్రమార్కులకు బీజేపీ అడ్డాగా మారిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రచార జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈ నెల 6న కాజీపేటలో ప్రారంభమైన ప్రచార జాతా సోమవారం హనుమకొండ మండలానికి చేరుకుంది. జీటీ రెడ్డినగర్ నుంచి పలివేల్పుల వరకు పాదయాత్ర నిర్వహించారు. హనుమాన్‌నగర్ చేపల బ్రిడ్జి వద్ద పార్టీ నాయకులు జాతాకు స్వాగతం పలికారు. బతుకమ్మలు, కోలాటాలతో మహిళలు పాల్గొన్నారు.
హనుమాన్‌నగర్‌లో జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యావసర ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను కేంద్రం విస్మరించిందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని, రైతుల ఉద్యమంతో వాటిని వెనక్కి తీసుకోవాల్సి




వచ్చిందన్నారు. బ్యాంకులు, ఎల్ఐసీ, రైల్వేలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.
అయోధ్య రామాలయంలో చోరీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీకి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా



సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి ఎన్.ఏ.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



**కేసముద్రం/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త);**హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కేసముద్రంలో బీజేపీ నాయకులు సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు తన నివాసంపై జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యతను చాటిచెప్పేందుకు ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, లీగల్‌సెల్ జిల్లా ఇన్‌చార్జి తుంపిళ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్, నాయకులు ముదిరెడ్డి మురళి, గుండు దామోదర్, ఉమేష్‌గౌడ్, బొల్లోజు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రియాంక కుటుంబానికి అండ

## : మంత్రి టీజీ భరత్ -రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేత..

### వైద్య, మెడికల్ పీజీ ఫీజు ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది

### ఎక్లాస్పూర్‌లో ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి





**గద్వాల ఆగస్టు 10(జర్నలిస్ట్ వార్త);**
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ భరోసా ఇచ్చారు. రాజమండ్రిలో ఇద్దరు వ్యక్తులు నిర్లక్ష్యంగా కారు నడిపి ఢీకొన్న ఘటనలో ప్రియాంక మృతి చెందిన నేపథ్యంలో మంత్రి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.
ఎక్లాస్పూర్ గ్రామానికి వెళ్లిన మంత్రి టీజీ భరత్.. ప్రియాంక మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.20 లక్షల ఆర్థిక సాయం చెక్కును ప్రియాంక తండ్రికి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామని హామీ ఇచ్చారు.ప్రియాంక చికిత్స పొందిన సమయంలో ఆసుపత్రిలో అయిన వైద్య ఖర్చులతో పాటు, ఆమె మెడికల్ పీజీ సీటుకు సంబంధించిన ఫీజు ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రియాంక కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని, కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని విధాలా తోడుగా ఉంటామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# రామనర్సమ్మకు మాలోత్ కవిత నివాళి



**కేసముద్రం/ ఆగస్టు 10(జర్నలిస్ట్ వార్త);** కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆగే వెంకన్న తల్లి రామనర్సమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత సోమవారం ఆయన నివాసానికి వెళ్లి రామనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పరకాల శ్రీనివాస్‌రెడ్డి, జాటోత్ హరీష్‌నాయక్, గుగులోతు వీరునాయక్, రావుల శ్రీనాథ్‌రెడ్డి, కమటం శ్రీనివాస్, ఆగే రాము, పాయిరాల శరత్‌యాదవ్, రావుల వినయ్, సురేష్‌యాదవ్, బిర్రు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మామునూరుకు మహర్దశ!

విమానాశ్రయానికి కేంద్రం ఆమోదం.. -వరంగల్ అభివృద్ధికి కొత్త రెక్కలు

దశాబ్దాల కల సాకారం కాబోతోంది.-కొండేటి శ్రీధర్ -భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలి

ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి ఆహ్వానం







**న్యూఢిల్లీ/ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్-మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం దిశగా కీలక ముందడుగని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్‌తో పాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కొత్త ఊపొస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రి కార్యాలయంలో అధికారిక లేఖను అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రామ్మోహన్ నాయుడు చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధతోనే ఈ కీలక నిర్ణయం సాధ్యమైందని శ్రీధర్ పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి కొణిదెల చిరంజీవి చేతుల మీదుగా మామునూరు విమానాశ్రయ ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని కొండేటి శ్రీధర్ గుర్తుచేశారు. అప్పటి నుంచి విమానాశ్రయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, ప్రస్తుతం ప్రాజెక్టు ముందుకు సాగుతుండటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మామునూరు విమానాశ్రయం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలతో పాటు సమీప ప్రాంత ప్రజలకు విమానాశ్రయంలో తగిన ఉద్యోగావకాశాలు కల్పించాలని కేంద్ర మంత్రిని కొండేటి కోరారు. ప్రాజెక్టు వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతంలో వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

### వరంగల్‌కు రావాలని ఆహ్వానం

మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు శంకుస్థాపన, అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని బీజేపీ నేతలు ఆహ్వానించారు. కేంద్ర మంత్రి వరంగల్ పర్యటనకు వస్తే ఈ ప్రాంత అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత మరింత స్పష్టమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# కూల్చిన చోటే పెద్ది విగ్రహం





## ఉద్రిక్తతల నడుమ ఆవిష్కరణ

**నర్సంపేట/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహావిష్కరణ నర్సంపేటలో ఉద్రిక్తతల నడుమ సోమవారం జరిగింది. నర్సంపేట మెడికల్ కాలేజీ ఎదుట విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెకు అనుమతులు లేవంటూ అధికారులు తొలగించడంపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాత్రివేళ ఎవరూ లేని సమయంలో గద్దెను కూల్చివేశారని, ప్రజాసేవ చేసిన నేత విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను తొలగించడం అన్యాయమని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆరోపించాయి. గద్దె కూల్చివేతకు కాంగ్రెస్ కార్యకర్తలే కారణమని ఆరోపిస్తూ సోమవారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అనంతరం కూల్చిన ప్రదేశంలోనే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తిరిగి గద్దె నిర్మించి పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కొబ్బరికాయ కొట్టి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళు లర్పించారు. విగ్రహావిష్కరణను అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ బీఆర్‌ఎస్ శ్రేణులు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భూమి హక్కుపై వివాదం..

## అధికారులకు ఫిర్యాదు




**ఇనుగుర్తి/ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** ఇనుగుర్తి మండలం కొమటపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమికి సంబంధించి మారేపాక సాల్మన్ కుటుంబ సభ్యులు, మారేపాక వెంకన్న అలియాస్ ఏసురత్నం మధ్య వివాదం నెలకొంది. తమ కుటుంబానికి చెందిన భూమిపై వెంకన్నకు హక్కు లేదని సాల్మన్ కుమారులు హరీశ్, ధర్మరాజు, అశోక్ పేర్కొన్నారు. సోమవారం సంబంధిత వ్యవసాయ భూమి వద్ద వారు నిరసన తెలిపారు. వారి వాదన ప్రకారం. కొమటపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 772/ఏ, 725/ఏలో మొత్తం ఏడు ఎకరాల భూమికి సంబంధించి 2012లో తమ తండ్రి మారేపాక సాల్మన్ నుంచి పత్రాలపై సంతకాలు తీసుకున్నారని తెలిపారు. అయితే భూమికి సంబంధించిన డబ్బులు పూర్తిగా చెల్లించలేదని, ప్రస్తుతం సదరు భూమిని వెంకన్న సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, కోర్టు ఆదేశాలు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ, తమకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను కోరారు. భూమికి సంబంధించిన హక్కులు, పత్రాలు, కోర్టు ఉత్తర్వులను పరిశీలించి న్యాయపరంగా సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులను కోరారు. అధికారుల విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది. భూమి యాజమాన్య హక్కు, పత్రాల చెల్లుబాటు, కోర్టు ఉత్తర్వుల అమలు తదితర అంశాలపై సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం చట్టపరమైన నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఈ ఆరోపణలపై మారేపాక వెంకన్న అలియాస్ ఏసురత్నం వివరణ అందుబాటులోకి రాలేదు.

# గడ్డిమం దు తాగి వ్యక్తి మృతి



**దామెర/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన దామెరలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన చిర్లంచ రాజు (50)కు భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో చిన్నపాటి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల ర్యాలీ



**కేసముద్రం/ ఆగస్టు 10(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేసముద్రంలో కార్మికులు, రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ సెంటర్ నుంచి మహాత్మా జ్యోతిబాపూలే సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, వరంగల్ ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులతో పాటు రైతులు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు నిరసనలో పాల్గొన్నారు. కేసముద్రం ఎస్సై క్రాంతికిరణ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. నాయకులు నిరసన కొనసాగించడంతో వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించగా తోపులాట జరిగింది. అనంతరం పలువురు నాయకులను అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, బొబ్బల యాకుబ్‌రెడ్డి, చాగంటి కిషన్, తాడబోయిన శ్రీశైలం, జల్లే జయరాజ్, మోడెం వెంకటేశ్వర్లు, నీరుటి జలంధర్, కావటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# బండఔతపురంలో నూతన గ్రామ కమిటీలు



**వర్ధన్నపేట/ఆగస్టు 10(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని బండఔతపురం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన గ్రామ కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశానికి ముత్యాల మల్లేశం మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కట్ల రాజశేఖర్ మాదిగ, జిల్లా ధర్మన్న మాదిగ పాల్గొని మందకృష్ణ మాదిగ ఉద్యమ చరిత్రను వివరించారు. పీడిత వర్గాల హక్కుల కోసం, అంటరానితన నిర్మూలనకు చేపట్టే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడిగా మరుపట్ల క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా మరుపట్ల భాస్కర్, మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా మంద భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కలకోట్ల రాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాటికాయల వివేక్, మంద అమరేందర్, చాడ కరుణాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కరుణాకర్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**హనుమకొండ/ ఆగస్టు 10( జర్నలిస్ వార్త)**

బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్‌ఐటీ వరంగల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొలిపాక కరుణాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న కరుణాకర్ మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరింత సేవ చేయాలని శుభాకాంక్షలు తెలిపారు.



# పాపన్న జయంతికి గౌడ సంఘాల భారీ తరలింపు



**మహబూబాబాద్/ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలకు మహబూబాబాద్ జిల్లా గౌడ సంఘాల నాయకులు భారీగా తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన జయంతి వేడుకలకు జైగౌడ్ కమిటీ, ఐక్య గౌడ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు బయలుదేరారు. జైగౌడ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గుదే వీరన్నగౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గౌడల అభ్యున్నతికి సంఘటితంగా కృషి చేస్తామన్నారు. గౌడలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితర స్థానాల్లో గౌడలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌడ సోదరులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల వెంకన్నగౌడ్, గోపా సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్‌గౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, జైగౌడ్ కమిటీ నాయకులు బూర పూర్ణచందర్‌గౌడ్, బాలగని నవీన్‌గౌడ్, నలమాస సాయిగౌడ్, గుదే యుగేందర్‌గౌడ్, గంధసిరి వేణుగౌడ్, కాంచాని శంకర్‌గౌడ్, బత్తిని వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక
మంగళవారం 11 ఆగస్టు 2026

# పంచాయతీలకు కేంద్ర నిధులేనా?

## రాష్ట్ర నిధులు ఎక్కడ?




**సత్తుపల్లి/ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** గ్రామపంచాయతీలకు కేంద్ర నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పంచాయతీలు బలోపేతమైతేనే గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయని పేర్కొంటున్నారు.73వ రాజ్యాంగ సవరణతో పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత కల్పించి గ్రామస్థాయిలో అధికారాలు, బాధ్యతలు అప్పగించారు. అయితే నిధుల కొరతతో అనేక గ్రామపంచాయతీలు అధికారం ఉంది.నిధులు లేవు అన్న పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంట్లతోపాటు వివిధ కేంద్ర పథకాల ద్వారా నిధులు వస్తున్నప్పటికీ.రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, ఇతర నిర్వహణ నిధులు సక్రమంగా అందకపోతే పంచాయతీలపై భారం పడుతోంది.కేంద్ర నిధులను నిర్దిష్ట పథకాలకు మాత్రమే వినియోగించాల్సి ఉండటంతో గ్రామాల్లో రోజువారీ అవసరాలకు నిధుల కొరత ఏర్పడుతోంది. వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి పైపుల మరమ్మతులు, డ్రైనేజీలు, పారిశుధ్యం, రోడ్లపై గుంతల పూడ్చివేత, సిబ్బంది జీతాలు తదితర ఖర్చులకు పంచాయతీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.రాష్ట్ర వాటా ఇవ్వాలిరాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేసి పంచాయతీలకు రాష్ట్ర ఆదాయంలో తగిన వాటా కేటాయించాలని కోరుతున్నారు. నిధులతోపాటు అవసరమైన అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పంచాయతీల సొంత ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పన్నుల వసూళ్లు, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ సామాజిక తనిఖీలను నిర్వహించాలని అంటున్నారు.కేంద్రం నిధులు ఇస్తుంది కదా అని రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది.

## ఎమ్మెల్యే మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలి



**తల్లాడ/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా కృషి చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లాడలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వీరారెడ్డి పిలుపునిచ్చారు.

## పొంగులేటికి ఎమ్మెల్యే నాగరాజు ఘనస్వాగతం



**హసన్‌పర్తి/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పర్యటనకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘనస్వాగతం పలికారు. సోమవారం మధ్యాహ్నం హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్ట జంక్షన్‌కు మంత్రి చేరుకోగా ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రితో కాసేపు ముచ్చటించారు. హసన్‌పర్తి పర్యటనకు వచ్చిన మంత్రికి ఘనస్వాగతం పలకడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసుల ఆర్థిక సాయం



**హసన్‌పర్తి/ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ పారుపల్లి ధనుంజయ్ కుటుంబానికి హసన్‌పర్తి పోలీసుశాఖ అండగా నిలిచింది. ఇటీవల కోమల్ల టోల్‌గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ధనుంజయ్ మృతిచెందారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కునూరు గ్రామానికి చెందిన ఆయన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మంచి పేరు పొందారు.సోమవారం హసన్‌పర్తి సీఐ మహేందర్, పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి ధనుంజయ్ స్వగ్రామంలోని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పోలీస్ కమిషనర్ మంజూరు చేసిన రూ.30 వేల దహన సంస్కారాల ఖర్చుతో పాటు స్టేషన్ సిబ్బంది స్వచ్ఛందంగా సేకరించిన రూ.75 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మొత్తం రూ.1.05 లక్షల నగదును అందించారు.ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన ధనుంజయ్ మృతి పోలీసుశాఖకు తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## అక్రమ టేకు కలపను స్వాధీనం.

### -ఎఫ్ఆర్ఓ రవికిరణ్.





**బయ్యారం/,ఆగస్టు 10.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని కస్తూరి నగరం బీటి పరిధిలో చుంచు బంధం తండాలో అక్రమంగా టేకు కలపను నిలువ ఉంచినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం రావడంతో ఎఫ్ఆర్ఓ రవి కిరణ్ తన సిబ్బందితో వెళ్లి అక్రమ టేక్ కలపను స్వాధీనం చేసుకొని బయ్యారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న కలప 1.227 సీఎంటి ఉంటుందని దీని విలువ 76 వేల 79 రూపాయలుగా నిర్ధారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలపను ఇల్లందు ఫారెస్ట్ డిపోకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓలు, కస్తూరినగరం బీట్ అధికారి,బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ, ఐఓటీతో స్మార్ట్ జీవనం



**హసన్‌పర్తి/ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా సైన్స్ సాంకేతికతలతో సమాజంలో అనేక సమస్యలకు పరిష్కారాలు చూపవచ్చని అమెరికాలోని మిస్సౌరీ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ సజల్ కె. దాస్ అన్నారు. కిట్స్ వరంగల్‌లోని సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో స్మార్ట్ సెన్సింగ్ నుంచి స్మార్ట్ లివింగ్ వరకు అంశంపై సోమవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు.క్యాంపస్‌లోని సివిల్ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సజల్ కె. దాస్ ఏఐ, ఎంఎల్, ఐఓటీ, డేటా సైన్స్ సమ్మేళనంతో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను వివరించారు. డిమెన్షియా, పార్కిన్సన్స్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడం, స్మార్ట్ వ్యవసాయం తదితర రంగాల్లో ఏఐ ఆధారిత సాంకేతికతల వినియోగాన్ని ప్రాజెక్టుల ద్వారా వివరించారు. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశోధన వైపు దృష్టి సారించాలని సూచించారు.కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఎన్ఐటీ వరంగల్ డీన్ ప్రొఫెసర్ టి. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఏఐ, ఐఓటీ, డేటా సైన్స్‌లో తాజా పరిణామాలపై కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.కార్యక్రమంలో సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగాధిపతి డాక్టర్ జ్యోతిప్రభ, డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎస్. నరసింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విభాగం అధ్యాపకులు, విద్యార్థి సమన్వయకర్తలను కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, అదనపు కార్యదర్శి వొడితల సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి అభినందించారు.

## బయ్యారంలో జైల్ భరో ఉద్రిక్తం






**బయ్యారం/ఆగస్టు 10(జర్నలిస్ట్ వార్త);** కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం బయ్యారం మండల కేంద్రంలో జైల్ భరో' నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శనగా వచ్చి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదంటూ పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కుంట ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండా రాజన్న, మండల కార్యదర్శి వల్లాల వెంకన్న, సీఐటీయూ మండల కోకన్వీనర్ అంగిరేకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'

### ఇంటిపై జాతాయ జెండాను ఆవిష్కరించిన రామచంద్రారవు

**హైదరాబాద్,ఆగస్టు 10(జర్నలిస్ట్ వార్త);** 'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. సోమవారం తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'ను నిర్వహిస్తున్నామని.. పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు. అందులో భాగంగానే ఈరోజు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. లాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబంధించింది కాదని... భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత భారత్' సంకల్పంతో చేపడుతున్న యాత్ర అని చెప్పారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



**తల్లాడ/ ఆగస్టు 10 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని నూతనకల్లు గ్రామంలో ముతుమ్ లక్ష్మి, లేటు బసవయ్య దశదిన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా యువజన నాయకుడు అడపా అనిల్ చౌదరి హాజరై మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యుడు వీరబాబు ముదిరాజ్ పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ ప్రముఖులు ప్రతాప్, వెంకటేశ్వర్లు, నాయకులు కల్యాణపు వెంకటయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపిని పరామర్శించిన నాయకులు.



**బయ్యారం/,ఆగస్టు 10.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మాజీ ఎంపీపీ కిషన్ నాయక్ తీజ్ పండుగ వేడుకలను ముగించుకొని తిరిగి ఇంటికీ వెళ్తుండగా బైక్ ప్రమాదంలో చేతికి గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిషన్ నాయక్ ని పలువురు సర్పంచులు,నాయకులు పరామర్శించారు.ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండే కిషన్ నాయక్ ప్రమాదానికి గురై హాస్పిటల్ లో చూసిన నాయకులు భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు కిషన్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెంకట్రాంపురం సర్పంచ్ శివాజీ నాయక్,బాల్యతండా సర్పంచ్ దేవోజీ,నూద్దునూరి లింగయ్యగార్ల మాజీ ఎంపీపీ వెంకట్ లాల్,వార్డ్ మెంబర్ కేస సందీప్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ నాయక్ ని పరామర్శించిన రేల ఆగిరెడ్డి.



**బయ్యారం/,ఆగస్టు 10.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలో శనివారం బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మాజీ ఎంపిపి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిషన్ నాయక్ ను బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రేల ఆగిరెడ్డి సోమవారం పరామర్శించారు.ఈ సందర్భంగా కిషన్ నాయక్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.వైద్యులకు త్వరగా కోలుకునేల వైద్యం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.